క్లుప్తంగా

అనంత కోదండరామస్వామి దేవస్థానానికి విరాళం



విరాళం అందిస్తున్న కొండ శ్రీనివాసరావు

ఒంగోలు మెట్రో: స్థానిక సత్యనారాయణపురం దిబ్బల రోడ్డు రామాలయం వారి వీధిలో వాటర్ ట్యాంకు పక్కనున్న అనంత కోదండ రామస్వామి దేవస్థానం పునర్నిర్మాణం పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం ఉదయం శ్రీ తులసి ట్రావెల్స్ అధినేత కొండ శ్రీనివాసులు, ప్రశాంతి దంపతులు దేవస్థానానికి వచ్చే భక్తుల దాహార్తి తీర్చే నిమిత్తం మంచినీటి వాటర్ ట్యాంకు ఏర్పాటుకు దేవస్థాన అభివృద్ధి కమిటీకి రూ.45,000 విరాళం అందించారు. ముందుగా కొండ శ్రీనివాసులు అనంత కోదండరామస్వామి వారిని దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థాన అభివృద్ధి కమిటీ వారు శ్రీనివాసరావును స్వామివారి శేషవస్త్రంతో సన్మానించారు.

ఆలయాల్లో భక్తుల పూజలు

పెద్దారవీడు: మండలంలోని గుండంచర్ల పంచాయతీలో నల్లమల అడవిలో వెలసిన వేనూతల కాటమరాజుస్వామి, గంగాభవానీ, మండల కేంద్రం పెద్దారవీడు సమీపంలో వెలసిన అంకాళమ్మకు భక్తులు భక్తిశ్రద్ధలతో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ పూజారి స్వామి, అమ్మవారికి అభిషేకాలు చేశారు. కుంకుమ, పసుపు, పట్టువస్త్రాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో మహిళలు పొంగళ్లు తయారు చేసి స్వామికి సమర్పించారు.

కోటసత్యమాంబదేవికి ప్రత్యేక పూజలు

బేస్తవారిపేట: మండలంలోని గొట్లమిండ్ల సమీపంలోని కోటసత్యమాంబదేవి, బేస్తవారిపేట, పాపాయిపల్లెలో పోలేరమ్మ ఆలయాల్లో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోటసత్యమాంబదేవి ఆలయంలో అమ్మవారిని, సత్యమణికంఠేశ్వరస్వామిని ప్రత్యేకంగా అలంకరించారు, అభిషేకాలు, కుంకుమ పూజలు చేశారు. పలు గ్రామాల భక్తులు కుంకుమబండ్లతో సత్యమాంబదేవి ఆలయం వద్దకు తరలి వెళ్లారు. అమ్మవారికి నైవేద్యం సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు.

గురుకుల పాఠశాలలో దరఖాస్తుల ఆహ్వానం

కంభం: స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో (బాలికలు) 6,7 తరగతుల్లో 2024–25 విద్యా సంవత్సరానికి మిగులు సీట్లు భర్తీ చేసేందుకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ పి. చాముండేశ్వరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆధార్ కార్డు, కుల ధ్రువీకరణ పత్రం జెరాక్సు కాపీలతో ఈనెల 25వ తేదీ సాయంత్రం లోపు గురుకుల పాఠశాలలో సమర్పించాలన్నారు. దరఖాస్తు చేసుకున్న వారికి ఈనెల 27వ తేదీన ఉదయం 10 గంటలకు రాత పరీక్ష నిర్వహిస్తామని తెలిపారు.

అర్ధవీడు (బేస్తవారిపేట): స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో 6వ తరగతి నుంచి 9వ తరగతి వరకు మిగిలిన సీట్లకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ బండి బలరామిరెడ్డి తెలిపారు. ఈనెల 25వ తేదీ దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 26వ తేదీన ఉదయం 10 గంటలకు పరీక్ష నిర్వహిస్తామని చెప్పారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

మార్కాపురం టౌన్: పట్టణంలో వెలసిన శ్రీ అల్లూరి పోలేరమ్మ దేవాలయంలో పోలేరమ్మ అమ్మవారిని ఆదివారం భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి వివిధ రకాల పుష్పాలు, పూలమాలలు, నిమ్మకాయ దండలతో అలంకారం నిర్వహించారు. పట్టణంతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు కుంకుమ బండ్లతో రంగులు చల్లుకుంటూ వచ్చి ఆలయ ప్రాంగణంలో పొంగళ్లు, నైవేద్యం తయారు చేసి అమ్మవారికి సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి అమ్మవారికి అర్చన, కుంకుమార్చన కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులకు ఏర్పాట్లను ఆలయ ఈఓ చెన్నకేశవ రెడ్డి, సిబ్బంది పర్యవేక్షించారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న పూర్వ విద్యార్థులు



కార్యక్రమంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు

చీమకుర్తి: పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ద్వారా దాదాపు 39 సంవత్సరాల క్రితం నాటి విద్యార్థులు ఒక్కటయ్యారు. 1985–86వ సంవత్సరంలో చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో పదో తరగతి చదివిన సుమారు 100 మంది విద్యార్థులు ఆదివారం చీమకుర్తి ప్రభుత్వ హైస్కూల్లో కలుసుకున్నారు. ఒకరికొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. ఆనాటి రోజులు, ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులతో క్లాస్ రూమ్‌లలో గడిపిన మధుర క్షణాలను గుర్తుచేసుకున్నారు. ఇప్పుడు ఎవరెవరు ఏ విధంగా ఉన్నారు, వారి పిల్లల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. అంతేగాకుండా తమ బ్యాచ్‌కు చెందిన విద్యార్థులంతా సేవా కార్యక్రమాలతో తాము చదువుకున్న హైస్కూలుకు అండగా నిలవాలనుకున్నారు. అందులో భాగంగా భారతరత్న డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆవిష్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మానించారు. కార్యక్రమంలో ఏఎంసీ మాజీ చైర్మన్ మారం వెంకారెడ్డి, గొల్లపూడి వెంకట్రావు, బాళం శ్రీనివాసరావు, బక్కా రత్నం, ముప్పూరి రంగారావు, తదితరులు పాల్గొన్నారు.

ఏటా రూ.100 కోట్ల సేవా కార్యక్రమాలు



సిమెంటు బల్లలను ప్రారంభిస్తున్న వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు పాండురంగయ్య

చీమకుర్తి: అంతర్జాతీయ స్థాయిలో వాసవీ క్లబ్ ద్వారా ప్రతి ఏటా రూ.70 కోట్ల నుంచి రూ.100 కోట్ల విలువ చేసే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వాసవీ క్లబ్ అంతర్జాతీయ ఉపాధ్యక్షుడు డీ పాండురంగయ్య తెలిపారు. ఆదివారం సంతనూతలపాడులో వాసవీ క్లబ్, మహిళా క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సేవా కార్యక్రమాలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో 2 వేల వాసవీ క్లబ్‌లు ఉన్నాయని, లక్ష మంది సభ్యులు సేవా కార్యక్రమాలలో భాగస్వాములవుతున్నారని తెలిపారు. అనంతరం ఉపాసన ప్రైవేటు ఆస్పత్రి సహకారంతో ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ప్రారంభించి 248 మంది రోగులకు వైద్యసేవలందించారు. తదుపరి వాసవీ క్లబ్ నిర్వాహకుల ద్వారా ఒంగోలు మానసిక వికాస కేంద్రానికి బియ్యం, కుర్చీల బహూకరణతో పాటు పాఠశాల ప్రాంగణంలో సిమెంటు బల్లలు ఏర్పాటు చేసే కార్యక్రమాలను ప్రారంభించారు. అనంతరం జర్నలిజంలో 30 సంవత్సరాలకుపైగా విశేష సేవలందించిన సీనియర్ జర్నలిస్ట్ శిఘాకొల్లి శ్రీనివాసరావును సత్కరించారు. వాసవీ క్లబ్ ప్రతినిధులు, అధ్యక్ష, కార్యదర్శులు జీఎల్ ప్రసాదరావు, వీవీ శేషారావు, చలువాది చంద్రావతి, లక్ష్మి, పద్మజ, శరత్‌బాబు, విజయలక్ష్మి, స్థానికులు పాల్గొన్నారు.

ప్రతి రెవెన్యూ కార్యాలయంలో నిర్వహించాలి

కందుకూరు: కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ కార్యాలయంలో ప్రతి సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార కార్యక్రమాన్ని కచ్చితంగా నిర్వహించాలని సబ్ కలెక్టర్ విద్యాధరి అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాన్ని అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరుకావాలని, అధికారుల హాజరును ధ్రువీకరిస్తూ ఉన్నతాధికారులకు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. అలాగే ప్రతి సోమవారం సబ్‌కలెక్టర్ కార్యాలయంలో కూడా ప్రజా ఫిర్యాదుల స్వీకరణ జరుగుతుందని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉలవపాడు: స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం ప్రజా పరిష్కార ఫిర్యాదు వ్యవస్థ నిర్వహించనున్నట్లు తహసీల్దార్ చంద్రారెడ్డి తెలిపారు. ఉదయం 10 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని రకాల ఫిర్యాదులు స్వీకరిస్తామని చెప్పారు. ఫిర్యాదులను ప్రత్యేక ఐడీలతో నమోదుచేస్తామని, ఈ ఐడీల ద్వారా ఫిర్యాదుల స్థితిని ట్రాక్ చేయవచ్చని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



గ్రాడ్యుయేషన్ డేలో సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

ఒంగోలు: స్థానిక క్విస్ ఇంజినీరింగ్ కాలేజీలో ఆదివారం గ్రాడ్యుయేషన్ డేని ఘనంగా నిర్వహించారు. నాలుగు సంవత్సరాల ఇంజినీరింగ్ విద్య పూర్తిచేసిన విద్యార్థులకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో కాకినాడ జేఎన్‌టీయూ ఉప కులపతి డాక్టర్ జీవీఆర్ ప్రసాదరావు పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని నిర్దేశించుకుని ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగినప్పుడే మంచి ఇంజినీర్లుగా ఎదుగుతారన్నారు. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు కావాలనుకునే వారు ఎప్పటికప్పుడు ఆ రంగంలో వచ్చిన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, మెషీన్ లెర్నింగ్, డేటా సైన్స్ వంటి నూతన ఒరవడులను నేర్చుకోవాలని సూచించారు. ఫలితాలపై నిరుత్సాహం చెందకుండా ఒకటికి రెండుసార్లు ప్రయత్నిస్తూ ఉంటే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చన్నారు. డిగ్రీతోపాటు మానవ విలువలు పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అప్పుడే మన విద్యకు సార్థకత ఉంటుందన్నారు. క్విస్ కాలేజీ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ డాక్టర్ ఎన్.సూర్యకళ్యాణ్ చక్రవర్తి, వైస్ చైర్మన్ డాక్టర్ ఎన్.గాయత్రి, ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీ హనుమంతరావు, తదితరులు పాల్గొని విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించారు.

26 నుంచి అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు



అచ్చమాంబ పేరంటాలు మూల విగ్రహమూర్తి

పామూరు: మండలంలోని బొట్లగూడూరు పంచాయతీ పరిధిలోని రఘునాథపురం కమ్మవారిపాలెంలోని అచ్చమాంబ దేవస్థానంలో అచ్చమాంబ పేరంటాలు బ్రహ్మోత్సవాలు 26వ తేదీ బుధవారం నుంచి 30వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అడుసుమల్లి నరసింహులు, చెంచయ్య పేర్కొన్నారు. 26వ తేదీన నిలుపు, పసుపు కుంకుమ, సారెకావెళ్లు, 27న గణపతిపూజ, పుణ్యాహవచనం, గ్రామోత్సవం, 28న అమ్మవారికి అభిషేకం, గ్రామోత్సవం, 29న కల్యాణోత్సవం, కుంకుమార్చన, పసుపు కుంకుమ, పెద్ద ఉత్సవం, 30న బండ్లు, పొంగళ్లు, రాష్ట్రస్థాయి ఎడ్లపందేలతో బ్రహ్మోత్సవాలు ముగుస్తాయని దేవస్థాన కమిటీ తెలిపింది.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణస్వామి వ్రతాలు



సామూహిక సత్యనారాయణస్వామి వ్రతంలో పాల్గొన్న దంపతులు

ఒంగోలు మెట్రో: స్థానిక ప్రజాపిత బ్రహ్మకుమారీ ఈశ్వరీయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని బాలసంజీవని ధామం బచ్చల బాలయ్య సంజీవమ్మ ధార్మిక భవనంలోని కృష్ణప్రియ కన్వెన్షన్ సెంటర్లో రాజయోగి బీకే మంజునాథ్ ఆధ్వర్యంలో సామూహిక రమ వసుంధర సమేత సత్యనారాయణస్వామి వ్రతాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం ఉదయం 10 గంటలకు నిర్వహించిన వ్రతంలో పాల్గొన్న దంపతులచే గణపతి పూజ, మండపారాధన, కలశ పూజ, అభిషేకం, స్వామివారి అష్టోత్తర పూజలు చేయించి రమావసుందర సమేత శ్రీ సత్యనారాయణస్వామి వ్రత కథను వివరించారు. 21 మంది దంపతులు పాల్గొని భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ముఖ్యఅతిథిగా ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, భవన దాతలైన టీ మునికృష్ణయ్య హరిప్రియ దంపతులు పాల్గొన్నారు. బీకే మాధవి, బీకే రేవతి, బీకే రామలక్ష్మి, బచ్చల శివప్రసాద్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారు.

గోశాలకు కరీముల్లా బేగ్ ఆర్థిక సాయం

పొదిలి: స్థానిక దర్శి రోడ్డులో శ్రీకృష్ణ గోసంరక్షణ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడ యాభై గోవులను పోషిస్తున్నారు. గోమాతల కోసం అవసరమైన నవదాన్యాల కొనుగోలు కోసం హబీబుల్లా బేగ్ సంస్థ చైర్మన్ కరీముల్లా బేగ్ ఆర్థిక సాయం అందించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఆయన నగదును నిర్వాహకులకు అందించారు. ఈసందర్భంగా కరీముల్లాబేగ్ దాతృత్వాన్ని కొనియాడిన నిర్వాహకులు ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో గునుపూడి భాస్కర్, యక్కలి శేషగిరిరావు, మువ్వల పార్థసారథి, అప్పల శంకర్, గూడూరి వినోద్, యర్రంరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, పడియమర్రి తిరుపాలు పాల్గొన్నారు.

భైరవకోనకు పోటెత్తిన భక్తులు

సీఎస్‌పురం(పామూరు): మండలంలో ప్రముఖ పర్యాటక, పుణ్యక్షేత్రం భైరవకోనకు ఆదివారం భక్తులు పోటెత్తారు. ప్రకాశం, నెల్లూరు, వైఎస్సార్ కడప జిల్లాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో భైరవకోనకు వచ్చారు. ఈసందర్భంగా జలపాతంవద్ద స్నానమాచరించి అనంతరం త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర, కాలభైరవ, నగరేశ్వర ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. గుంటూరుకు చెందిన అమ్మ ఛారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు జ్ఞాన ప్రసన్నగిరి, సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పూజలు చేశారు. మండలంలోని పురాతన పుణ్యక్షేత్రం అయ్యలూరివారిపల్లె వద్ద ఉన్న శ్రీదేవి, భూదేవి సమేత తిరుమలనాథస్వామి ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు చేశారు.

నిర్విరామ ఉదయాస్తమ సేవలో వాసవీ క్లబ్



చదువుకునే పిల్లలకు విద్యా సామగ్రి అందిస్తున్న వాసవీ క్లబ్ సభ్యులు

ఒంగోలు మెట్రో: వాసవీ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ సమాజంలోని అన్ని వర్గాలకు, అన్ని వర్ణాలకు, కులమతాలకు అతీతంగా సేవలందిస్తూ అగ్రగామిగా నిలిచిందని వాసవీ క్లబ్ అంతర్జాతీయ సేవా సంస్థ ఉపాధ్యక్షుడు దొంతు పాండు రంగయ్య తెలిపారు. వాసవీ జిల్లాల రీజియన్ చైర్మన్ ఆధ్వర్యంలో వారి రిజియన్లో జరిగే ఉదయాస్తమ సేవలు క్లబ్ సభ్యుల్లో మరింత ఉత్సాహాన్ని కలిగిస్తాయన్నారు. వాసవీ జిల్లా వీ205ఏ రీజియన్ 4 చైర్మన్ టి.రంగస్వామి ఆధ్వర్యంలో రీజియన్లో జరిగిన ఉదయాస్తమ సేవల కార్యక్రమానికి పాండురంగయ్య ముఖ్య అతిథిగా, అంతర్జాతీయ కార్యక్రమాల పర్యవేక్షకుడు చందా వెంకటస్వామి గౌరవ అతిథిగా పాల్గొన్నారు. ఉదయాస్తమ సేవల్లో భాగంగా వాసవీ క్లబ్ ఒంగోలు అధ్యక్షుడు నల్లమల్లి బదరీ నారాయణ నేతృత్వంలో అంధులకు చేతి కర్రలు, విద్యార్థులకు విద్యా సామగ్రి, ట్రాఫిక్ పోలీసులకు ఫ్లోరోసెంట్ జాకెట్, మాస్కులు అందించారు. అవయవ దానంపై అవగాహన కలిగిస్తూ దాతల నుంచి అవయవ దాన ఆమోదపత్రాన్ని స్వీకరించడం, వాసవీ అమ్మవారి ఆలయానికి అవసరమైన సేవా క్లబ్‌కి నూతన సభ్యులను జోడించడం వంటి ఏడు సేవా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం ఉదయాస్తమ సేవల్లో భాగంగా నగరంలోని సూర్య సిరి దివ్యాంగుల ఆశ్రమంలోని అంధులకు చేతి కర్రలు, స్థానిక వాణి పబ్లిక్ స్కూల్ విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, తదితర విద్యా సామగ్రి అందించామని బదరీ నారాయణ తెలిపారు. తాతా బిల్డింగ్స్ వద్ద ఎండ నుంచి రక్షణ కలిగించే గొడుగులను చిరు వ్యాపారులకు అందించామని, ట్రాఫిక్ పోలీసులకు ఫ్లోరోసెంట్ జాకెట్స్, మాస్కులు, టవల్స్ అందించామని, రామాలయానికి అవసరమైన 1000 లీటర్ల రెండు వాటర్ స్టోరేజ్ ట్యాంకులు, మేజా బల్ల అందించామని వివరించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి పి.పవన్ కుమార్, కోశాధికారి జి.సునీల్ కుమార్, రీజియన్ చైర్మన్ టి.రంగస్వామి, రీజియన్ కార్యదర్శి ఏ.అమరా సత్యం, జోన్ చైర్మన్ నూకల శ్రీనివాసరావు, క్లబ్ పూర్వ అధ్యక్షుడు దర్శి మనోహర్ చంద్రశేఖర్, పెద్ద సంఖ్యలో వాసవీ క్లబ్ ఒంగోలు సభ్యులు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

కమనీయం.. వెంకటేశ్వరుని కల్యాణం



వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తూ భక్తులకు తాళిబొట్టు చూపిస్తున్న అర్చకులు

మద్దిపాడు: శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల కల్యాణాన్ని ఆదివారం మధ్యాహ్నం మద్దిపాడులో నభూతో నభవిష్యతి అనే విధంగా నిర్వహించారు. శ్రీ వెంకటేశ్వరస్వామి సేవా సమితి, మద్దిపాడు వారి ఆధ్వర్యంలో వేద పండితులు, ఆలయ అర్చకులు మంత్రాలు, మేళతాళాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ నిర్వహించిన స్వామివారి కల్యాణానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. స్వామివారి కల్యాణం తిలకిస్తూ గోవిందనామాలు పలికారు. స్వామివారి కల్యాణం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అనంతరం నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో 4 వేల మందికిపైగా పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ శ్యామ్ ముఖర్జీ వర్ధంతి



డాక్టర్ శ్యామ్ ముఖర్జీకి నివాళులర్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నాయకులు

ఒంగోలు సెంట్రల్: బీజేపీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం జన సంఘ్ వ్యవస్థాపకుడు డాక్టర్ శ్యామ్‌ముఖర్జీ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు పీవీ శివారెడ్డి మాట్లాడుతూ బ్రాహ్మణ కుటుంబంలో 1901 జూలై 1న బెంగాలీలో పుట్టిన డాక్టర్ శ్యామ్ ముఖర్జీ.. జాతీయ వాది నేతలలో ప్రముఖుడని తెలిపారు. 1951లో భారతీయ జనసంఘ్ పార్టీ స్థాపించి రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ సభ్యుడిగా ఉన్న ముఖర్జీ.. హిందూ జాతీయవాదాన్ని ప్రగాఢంగా నమ్మి దేశంలో అనేక హిందూ మహాసభలు నిర్వహించి తొలి హిందూ వాద రాజకీయ పార్టీని స్థాపించిన నేతగా స్థానం సంపాదించారని తెలిపారు. దేశ సమగ్రత కోసం ప్రాణ త్యాగం చేసిన మహనీయుడు అని కొనియాడారు. ఆయన కన్న కలలను నేడు బీజేపీ ఆధ్వర్యంలో పీఎం నరేంద్ర మోదీ సాకారం చేస్తున్నారన్నారు. 1953 జూన్ 23న కాశ్మీరుకు ప్రత్యేక ప్రతిపత్తిని వ్యతిరేకిస్తూ అనుమతి లేకుండా కాశ్మీర్‌లోకి ప్రవేశించేందుకు ప్రయత్నించగా అరెస్ట్ చేశారని, నిర్బంధంలో ఉన్న సమయంలో అనుమానాస్పద స్థితిలో తన ప్రాణాలను త్యాగం చేసిన మహనీయుడని అన్నారు. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తామని శివారెడ్డి అన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు, మహిళా మోర్చా, అధికార ప్రతినిధి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

వివాహ వేడుకకు హాజరైన ఎమ్మెల్యే బూచేపల్లి



కరిష్మాను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి

దర్శి: పట్టణంలో జరిగిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ షేక్ షకీలా అమీన్‌బాషా కుమార్తె కరిష్మా వివాహ వేడుకలకు దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి హాజరయ్యారు. వారి నివాసంలో పెండ్లి కుమార్తెను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. వారు ఇచ్చిన విందు స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

గుడ్లూరు: మండలంలోని చెమిడిదిపాడు వద్ద ఆంజనేయ స్వామి గుడి వద్ద హనుమాన్ చాలీసా పారాయణం ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆంజనేయస్వామిని పట్టు వస్త్రాలు, పూలు, తమలపాకులతో ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా గురుస్వామి హనుమత్ ప్రసాద్ మాట్లాడుతూ కోటి హనుమాన్ చాలీసా పారాయణ యజ్ఞంలో భాగంగా 2022లో ఏకాదశి రోజున ప్రారంభమై నేటికి 108 ఆదివారాలు హనుమాన్ చాలీసా పారాయణం పూర్తయిందన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందచేశారు. ఆలయం వెనుక వైపు పంచముఖి ప్రసన్న ఆంజనేయ స్వామి నూతన ఆలయ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయని ఆలయ ట్రస్టు చైర్మన్ ఆలూరు హనుమంతురావు తెలిపారు.

గంగమ్మదేవత గుడి పునర్నిర్మాణం



నిర్మాణంలో ఉన్న గంగమ్మగుడి



గంగమ్మదేవత పాత ఉత్సవ విగ్రహం

పుల్లలచెరువు: పుల్లలచెరువులోని చిన్నకండ్లేరు ప్రాజెక్టు వద్ద దాతల సహకారంతో గంగమ్మ దేవత గుడి పునర్నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. పుల్లలచెరువుకు దగ్గరలో నల్లమల అడవిలో సుమారు 200 ఎకరాల విస్తీర్ణంలో 1961 లో చిన్నకండ్లేరు ప్రాజెక్టును నిర్మించారు. ఆ సమయంలో కాంట్రాక్టర్ గంగమ్మగుడిని నిర్మించగా అది కాలక్రమేణా జీర్ణావస్థకు చేరింది. గుడి ఆ విధంగా ఉండడం మంచిది కాదనే ఉద్దేశంతో గ్రామపెద్దలు కె.రఘు, కె.కుమార్, జి.గురునాథం, డిష్‌చిన్నాలు గుడిని పునర్నిర్మించేందుకు ముందుకొచ్చి ఆ దిశగా పనులు మొదలుపెట్టారు. ఈ గుడి నిర్మాణం పూర్తయితే నందనవనంగా తయారుచేస్తామని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ ప్రాంతాన్ని పర్యాటక ప్రదేశంగా ఉండేలా తయారుచేస్తామని, దాతలు తమవంతు సహాయం అందజేయాలని వారు కోరుతున్నారు. త్వరలో ఈ గుడి నిర్మాణం పూర్తి చేసుకోనుంది.